
ప్రజాశక్తి
బుధవారం 16 జులై 2025 5
శ్రీ సత్యసాయి





పీఏబీఆర్‌లో మోటార్లు ఆన్ చేస్తున్న కార్మికులు

ఉన్నత విద్యకు తప్పని



- ఇంకా ప్రారంభం కానీ డిగ్రీ అడ్మిషన్లు
- ఆన్‌లైన్....ఆఫ్ లైన్‌పైనా స్పష్టత కరువు
- సిలబస్ మార్పులతోనే ఆలస్యమా...!
- అడ్మిషన్‌ల కోసం విద్యార్థుల నిరీక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో 86 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 73 ప్రయివేటు, 10 ప్రభుత్వ, 3 అటానమస్ కాలేజీలు ఉన్నాయి. ఆయా కాలేజీల పరిధిలో సుమారు 35 వేలకుపైగా సీట్లు ఉన్నాయి. సాధారణంగా 60 నుంచి 70 శాతం మేర సీట్లు భర్తీ అవుతుంటాయి. గడిచిన మూడేళ్ల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దీంతో భారీగా సీట్లు మిగిలిపోతున్నాయి. గతేడాది అడ్మిషన్లు ప్రక్రియను ఆలస్యంగా నిర్వహించడం, మూడు విడతలకు మధ్య ఎక్కువ రోజులు ఖాళీ రావడంతో ప్రవేశాలు మరింత తగ్గాయి. గత విద్యా సంవత్సరం దాదాపు 40 కళాశాలలకు పైగా 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. కొన్ని గ్రూపుల్లో 10 నుంచి 15 మంది మాత్రమే చేరారు. విద్యార్థులు సంఖ్య తగ్గిన అనేక గ్రూపుల్లో అడ్మిషన్లు నిలిపేయాలని ఆయా కాలేజీలు నిర్ణయించాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది అయినా ప్రవేశాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఉన్నత విద్యాశాఖను ప్రయివేటు కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వేగంగా అడ్మిషన్లు ప్రక్రియను చేపడితే ప్రవేశాలు పెరుగుతాయని, తద్వారా కాలేజీల నిర్వహణ సులభతరం అవుతుందన్న భావనను వ్యక్తం చేశారు. అయితే కాలేజీల వినతిని ఉన్నత విద్యా శాఖ ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికీ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ ఇవ్వలేదు. షెడ్యూల్ విడుదల చేసిన తరువాత మూడు దశల్లో అడ్మిషన్లు ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం రెండు నెలలు సమయం పడుతుందని, అది కూడా వేగంగా చేస్తేనే ఇది పూర్తవుతుందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. ప్రవేశాలు కల్పించడం ఆలస్యమైతే సీట్లు భారీగా మిగిలిపోతాయని చెబుతున్నారు. ఆగస్టు నెలలోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తే కొంతలో కొంతైనా మేలు కలుగుతుందన్న భావనను డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి.



ఆఫ్ లైన్ విధానంలో అడ్మిషన్లు...?

ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన వెంటనే డిగ్రీ అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు వెలువడినప్పటికీ ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల వ్యవహారంపై స్పష్టత రాలేదు. గత వైసిపి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలోనే డిగ్రీ అడ్మిషన్లను చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది విద్యార్థుల సిలబస్‌కు సంబంధించి ఉన్నత విద్యామండలి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతానికి సింగిల్ మేజర్ విధానంలో సిలబస్‌ను అమలు పరుస్తున్నారు. సిలబస్‌లో మార్పులు తీసుకురావాలనే చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఇటీవల అమరావతిలో జరిగిన ఉన్నత విద్యామండలి సమావేశంలో డిగ్రీ మొదటి ఏడాదిలో డబుల్ మేజర్ విధానంలో పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాలనే అంశంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ మిషన్ కోర్సుల అమలుపై సమీక్ష జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. వీటిని అందుబాటులోకి తెచ్చి ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలుస్తోంది. అయితే వీటి అమలు కోసం విద్యార్థులను నెలల తరబడి నిరీక్షింప జేయడం ఏమిటంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సబ్జెక్టు విధానాన్ని త్వరితగతిన తేల్చి అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే చేపట్టాలని విద్యా ర్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకుల నుంచి వ్యక్తం అవుతోంది.

తక్షణమే అడ్మిషన్లు చేపట్టాలి

ఇంటర్ ఫలితాలు వెలువడి మూడు నెలలు పూర్తయ్యింది. డిగ్రీ అడ్మిషన్ల కోసం మూడు నెలలుగా విద్యార్థులు ఎదరు చూస్తున్నారు. ఇప్పటి వరకు అడ్మిషన్ల ప్రక్రియపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఉన్నత విద్య అడ్మిషన్లు లేకపోవడంతో ఇంటర్ పూర్తి చేసుకున్నా కూడా విద్యార్థులు ఇళ్ల వద్ద ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టాలి. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ విధానంలో వెంటనే అడ్మిషన్లు జరిపి పాఠ్యాంశాలను బోధించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో డిగ్రీలో అడ్మిషన్లు తగ్గి పోయే ప్రమాదం ఉంది.

ఎన్.నాగర్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, శ్రీ సత్య సాయి జిల్లా.

ఉన్నత విద్యను నీరుగార్చే చర్యలు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను నీరుగార్చేలా విధానాలు అవలంబిస్తోంది. డిగ్రీ ప్రవేశాల విషయంలో ఉన్నత విద్యా శాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గతేడాది కూడా ఇలాగే ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో అనేక కళాశాలల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలోని 83 కళాశాలల్లో సగానికి పైగా కళాశాల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. అడ్మిషన్లు ఆలస్యంగా మొదలు కావడమే దీనికి కారణం. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టాలి. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

ఓతూరు పరమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, అనంతపురం జిల్లా.

డిగ్రీ ప్రవేశాల కోసం ఎస్ఎఫ్ఐ నిరసన



వీసికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కళాశాల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నాడు యూనివర్సిటీ వద్ద ఆందోళన చేపట్టారు. వైస్‌ఛాన్సలర్ బి.అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, యూనివర్సిటీ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి సింగిల్ మేజర్ సబ్జెక్టు, డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం కోసం ఉన్నత విద్యా మండలి అధికారుల అభిప్రాయ భేదాలతో నోటిఫికేషన్ రాకుండా అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. ఈ సమస్యను పరిష్కరించి వెంటనే అడ్మిషన్లు ప్రారంభించాలని కోరారు. ఎస్కెయు పరిధిలోని న్యాయవిద్యకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరంలో 84 సీట్లను 66 సీట్లకు కుదించడం సరికాదన్నారు. ఈ విభాగానికి త్వరలో రానున్న ప్రవేశాల్లో సీట్లను పెంచి అవసరమైతే మరో సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. లా ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారందరికీ సీట్లు ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శాంతరాజ్, విజయ్, సాయికుమార్, విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విజయవంతం

- సమ్మె విరమణ... పీఏబీఆర్‌లో మోటార్లు ఆన్‌చేసిన కార్మికులు
- బకాయివేతనాలు చెల్లింపునకు అంగీకారం
- పీఎఫ్ బకాయిలకు కొంత గడువు
- కలెక్టర్, ప్రభుత్వానికి కార్మికుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, కళ్యాణదుర్గం టౌన్

. బకాయి వేతనాలు, పిఎఫ్ కోసం వంద రోజులుగా సమ్మె చేస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పోరాటం విజయవంతం అయ్యింది. బకాయిపడ్డ వేతనాలు, పిఎఫ్ చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలుపడంతోపాటు నిధులు విడుదల చేయడంతో మంగళవారం సాయంత్రం సమ్మెను విరమించారు. పంప్‌హౌస్‌లను ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. దీంతో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె విరమణ పూర్తయింది.

వంద రోజులుగా పోరాటం

బకాయిపడ్డ వేతనాలు, పిఎఫ్ కోసం ఏప్రిల్ 6వ తేదీ నుంచి జులై 15వ తేదీ వరకు వంద రోజులుగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలో ఉన్నారు. దీంతో కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం తదితర నియోజకవర్గాల్లో అనేక గ్రామాలకు తాగునీరు సరఫరా కూడా ఆగిపోయింది. దీంతో గ్రామాలకు నీటి సరఫరా ఆగింది. పోరాటం సాగిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజా మద్దతు కూడా పెరగడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ప్రజాప్రతినిధులకూ ఈ ఒత్తిడి అధికమవడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయించేందుకు తమ వంతు తోడ్పాటును అందించక తప్పని పరిస్థితి నెలకొంది.

కార్మికుల సమస్యపై అనంత కలెక్టర్ చొరవ

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల విషయంపై అనంతపురం కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద రూ.3.83 కోట్లు విడుదల అయ్యాయి. ఈ డబ్బులు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్‌లో గత సోమవారం జమ అయ్యాయి. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మంగళవారం నుంచి కార్మికులు విధుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్మికుల బకాయిలు చెల్లింపు విషయమై ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కార్మికులతో మాట్లాడి వారు విధుల్లోకి వచ్చేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. బకాయిలు చెల్లింపునకు కషిచేసిన కలెక్టర్‌కు కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం లభించేనా..?

కార్మికులు వేతనాలు, పిఎఫ్ కోసం నిరంతరంగా పోరాటం సాగించాల్సి వస్తోంది. పోరాటం సాగిస్తేగాని నిధులు విడుదలయ్యే పరిస్థితులుండటం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మార్గాలను కార్మిక సంఘం నాయకులు సూచిస్తున్నా ప్రభుత్వపరంగా జరగాల్సిన నిర్ణయం జరగడం లేదన్న విమర్శ ఉంది. సిపిడబ్లుస్కీమ్ కింద నడిచే పథకాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపుల్లేవు. ఫైనాన్స్ నిధుల నుంచే నిర్వహణకు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సమస్య వస్తోందని కార్మిక సంఘం నాయకులు సూచిస్తున్నారు.

కార్మిక విజయం

జి.ఓబులు సిఐటియు రాష్ట్ర నాయకులు

కార్మికుల సమిష్ట పోరాట విజయమిది. వంద రోజులుగా కార్మికులు తమ సమస్య పరిష్కారం కోసం పోరాటం సాగించారు. ప్రభుత్వాలు ఈ సమస్యకు తక్షణం పరిష్కారం చూపించాల్సింది. కాని ఇంత వరకు జాప్యం చేయడం సరైంది కాదు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పరిష్కారం విషయంతో తగిన చర్యలు తీసుకోవాలి.

నేడు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర నగర పంచాయతీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక బుధవారం జరుగనుంది, నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించనున్నారు. నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా టిడిపికి 14 మంది మద్దతుగా ఉన్నారు. ఎన్నికల ఏర్పాట్లను నగర పంచాయతీ కమిషనర్ జగనాథ్ మంగళవారం పరిశీలించారు.



ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహులు

హామీల అమలుకు ఐక్యపోరాటాలు

- భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి
- సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహులు
- గోరంట్లలో భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా 2వ మహాసభలు

ప్రజాశక్తి-గోరంట్ల

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన కార్మికుల సంక్షేమ బోర్డు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహులు డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని షాదీ మహల్‌లో భవన నిర్మాణ కార్మికుల సంఘం(సిఐటియు అనుబంధం) 2వ జిల్లా మహాసభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని మధురాయ దేవాలయం సమీపం నుంచి షాదీ మహల్ వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ మహాసభల జెండాను భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటరమణప్ప ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో ఆర్‌వి.నరసింహారావు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా సంక్షేమ బోర్డు ఏర్పాటు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసే జీఎస్టీలో ఒక్క శాతం భవన నిర్మాణ కార్మికుల నిధికి జమ అవుతోందని, ఆ నిధిలో ఇప్పుడు రూ.2,600 కోట్లు ఉన్నాయన్నారు. ఈ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించకుండా ఇతర పథకాలకు ప్రభుత్వం మళ్లిస్తోందన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే అన్ని విధాలా వారికి, వారి కుటుంబ సభ్యులకు మేలు జరుగుతుందన్నారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు అమల్లో ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా దానిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలంటే కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కార్మికుల పోరాటాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం కన్వీనర్ కొండ వెంకటేష్, నాయకులు రామకృష్ణ, నరసింహులు, స్వర్ణలత, బాబా, మండల అధ్యక్షులు వెంకటరమణ, కోశాధికారి బాబ్‌జాన్, ముత్యాలు, నవీన్, పాజిల్ నాగభూషణ, కెవిపిఎస్ నాయకులు హనుమయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే సమ్మెలోకి పారిశుధ్య కార్మికులు

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం
సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడిపి. శ్రీనివాసులు



హిందూపురంలో మోకాళ్లపై కూర్చొని నిరసన



పుట్టపర్తిలో ఆకులు తింటూ నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేస్తు గత 22 రోజుల నుంచి మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో దీక్షలను చేస్తున్నా పాలకులు, అధికారుల్లో కనీస స్పందన లేక పోవడంతోనే బుధవారం నుంచి విధులను బహిష్కరించి నిరవదిక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు పేర్కొన్నారు. పారిశుధ్యకార్మికులు మున్సిపల్ కార్యలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారానికి 22వ రోజుకు చేరాయి. మంగళవారం జరిగిన దీక్షలకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా సిఐటియు, నాయకులు, కార్మికులు మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదాలు చేశారు. అనంతరం జెడ్ పి శ్రీనివాసులు మాట్లాడుతు పారిశుధ్య కార్మికులు 22 రోజుల నుంచి శాంతి యుతంగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు నిరసన దీక్షలు చేస్తున్న పాలకులు, అధికారులు ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కార్మికుల 17 రోజుల సమ్మె సందర్భంగా మున్సిపల్ పరిపాలన అధికారులు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రధాన సమస్యలతో పాటు స్థానికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ అధ్యక్షకార్యదర్శులు మల్లికార్జున, జగదీష్, కోశాదికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకరా, చంద్రశేఖర్, కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవిత మ్మ గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 17న చలో విజయవాడ చేపట్టి రాష్ట్ర మున్సిపల్ సచివాలయాన్ని ముట్టడిస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. ఆకులు తింటూ తమ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆకులు అలుములు తిని బ్రతకాలా అని ప్రశ్నించారు. ప్రభుత్వంతో చర్చలు జరిపినప్పుడు ఈనెల 5న వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోనందున తాము ఈ నెల 12 నుంచి వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పోరాడి సాధించుకున్న జీవో 36 ను వెంటనే అమలు చేసి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింప చేయాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, రిటైర్మెంట్ 62 ఏళ్లకు పెంచాలని, జీవిత బీమా అమలు చేయాలని, హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచుతామనిమంత్రి నారాయణ చెప్పడమే గాని అమలు చేయలేదన్నారు. గత మూడు రోజులుగా నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు రమణ, గణేష్, రమేష్, రామదాసు, శివ, సాయినాథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సివిల్ సప్లయ్ హమాలీల మహాసభలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లా సివిల్ సప్లై హమాలీల 5వ మహాసభలు బుధవారం స్థానిక సాయి ఆరామం లో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారంఉదయం 11 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి సాయి ఆరామం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలో హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యచరణ ప్రణాళికలు పై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సివిల్ సప్లై హమాలీలు హాజరై ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పిఆర్ గెస్ట్‌హౌస్ మరమ్మతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పెనుకొండ

స్థానిక పిఆర్ గెస్ట్‌హౌస్ మరమ్మతులకు అధికారులు నిధులు మంజూరు చేశారు. 'శిథిలావస్థలో పంచాయతీరాజ్ అతిథి గృహం' శీర్షికన వారం రోజుల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అతిథిగృహ మరమ్మతులకు రూ.19 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న అతిథిగృహం మరమ్మతుల పనులు ప్రారంభించారు. అక్కడున్న చెట్లను తొలగించారు. భవనం లోపల ఫర్నిచర్, ఏసీ పరికరాల ఏర్పాటు పనులు చేపట్టారు.



అతిథిగృహం ముందు శుభ్రం చేసిన దృశ్యం

తాత్కాలిక డిడిఒ కార్యాలయం ఏర్పాటు : పంచాయతీరాజ్ అతిథిగృహాన్ని తాత్కాలిక డిడిఒ కార్యాలయంగా ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో నరేష్ కృష్ణ తెలిపారు. మరమ్మతులు చేసి అతిథిగృహం పైన సమావేశ మందిరం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆవిష్కరించిన కియా

కారెన్స్ క్లావిస్ ఈవీ రూ.17.99 లక్షల నుండి ప్రారంభం

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రముఖ మాస్-ప్రీమియం ఆటోమేకర్ కియా ఇండియా తన మొట్టమొదటి మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రిక్ వాహనం కారెన్స్ క్లావిస్ ఈవీని విడుదల చేసింది. దీని ధర రూ. 17.99 లక్షల నుండి ప్రారంభమవుతుంది. పెరుగుతున్న ఈవీ వినియోగదారుల అవసరాలను తీర్చేలా రూపొందించిన కారెన్స్ క్లావిస్ ఈవీ ఖర్చులో తగ్గింపు లేకుండా విశాలమైన స్థలం, ఇంటలిజెన్స్, సరళత్వాన్ని అందిస్తుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సుదీర్ఘ ప్రయాణం, విహారయాత్రలు, సాధారణ నగర ప్రయాణానికి కార్నెస్ క్లావిస్ ఈవీ సౌకర్యవంతంగా ఉంటుంది. రెండు బ్యాటరీ ఎంపికలతో శక్తివంతం: 51.4 కిలో వాట్స్ తో ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ పెడితే 490 కి.మీ ప్రయాణించవచ్చు. అదేవిధంగా 42 కిలో వాట్స్ పూర్తి ఛార్జ్ పెడితే 404 కి.మీ ప్రయాణించవచ్చు. 100 కె డబ్ల్యూ డి సి ఫాస్ట్ చార్టర్ ద్వారా కియా ఆప్టిమైజ్డ్ ఛార్జింగ్ కేవలం 39 నిమిషాల్లో 10 నుండి 80 శాతం వరకు ఛార్జింగ్ అవుతుంది. 90 కనెక్టివిటీ ఫీచర్లతో ఆధునిక, ప్రీమియం అనుభూతినిస్తుంది.



కియా ఆవిష్కరించిన ఇవి కారు

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనిచెన్నకేశవపురం గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం మమత, ఆశాలు సహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన నాయకులు

ప్రజాశక్తి - మడకశిర రూరల్

పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమానికి మడకశిర తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తరలి వెళ్లారు వారు అక్కడ జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు ఈ కార్యక్రమంలో మడకశిర తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు మల్లికార్జున, రేవన్న, ప్రభాకర్, నాగరాజు, నరసింహమూర్తి, బాషా తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం ఏడుగురు లబ్ధిదారులకు రూ. 5,12,451 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌రావు, పోతుకుంట రాజు, లక్ష్మీనారాయణ, సురేంద్ర నాయుడు, కుంచెపు రవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని కొండకమర్ల మినీ సెంటర్ తోపాటు మండల కేంద్రంలోని 1, 3 అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ గాయత్రి, సూపర్‌వైజర్లు విజయ కుమారి,సత్యవతి, గంగాదేవి, సిబ్బంది లక్ష్మితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు జయమ్మ, ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని నల్లగొండ రాయుని పల్లి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు రాజా రమేష్ ఇటీవల బదిలీల్లో పత్తికుంట పల్లె గ్రామానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అంజినాయక్, గ్రామస్తులు పెద్దకిష్టప్ప, ఉపాధ్యాయులు గణేష్, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు చంద్ర, శ్రీనివాసులు, రామాంజనేయులు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని బాలికల బీసీ హాస్టల్ వార్డెన్ సులోచన అన్నారు. హాస్టల్ విద్యార్థినీలతో కలిసి మంగళవారం ఉదయం హాస్టల్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్లాస్టిక్ ను నిషేధించిందని చెప్పారు. వాటిని వాడడం ద్వారా ప్రాణాంతక కరమైన వ్యాధులు వ్యాపిస్తాయని తక్షణమే వాటిని వాడటం మానుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి - గాండ్లపెంట

జాతీయ ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి వేతనాలు అంతక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుటుంబ జీవనం జరిగేది ఇబ్బందిగా ఉందని పిల్లలు చదువుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సువర్ణ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజలను తమ కార్యాలయం చుట్టూ తిప్పించుకోకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ నరసింహులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని మల్ల మీద పల్లిలో ఎస్సీ ఎస్టీ పై చట్టాలపై జమేధర్ గంగాధర్, పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. చట్టాలను ఉల్లంఘించితే కఠిన చర్యలు తప్పవని అందరూ సమానంగానే ఉండాలని పోలీసులు తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాసులు భాస్కర్ రాజు మురళి నరసింహ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు




కదిరి, హిందూపురంలో ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డివిజన్ ఏడీఏ సనావుల్లా ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి తదితరులు కదిరిలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అనుమతులు లేని రూ.7.50 లక్షల విలువ జేసే ఎరువులను అధికారులు సీజ్ చేశారు. ఇందులో భాగంగా న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్స్, శ్రీ లక్ష్మి శ్రీనివాస ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీలు నిర్వహించిన అధికారులు స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులు, దుకాణానికి సంబంధించిన సర్టిఫికెట్లు, ఈపాస్ మిషన్ పరిశీలించారు. 3.795 మెట్రిక్ టన్నుల ఎరువులకు సంబంధించి ప్రధాన సర్టిఫికెట్లు, లైసెన్సులు, సరైన అనుమతులు లేనందున 7,56,000 రూపాయల విలువ గల ఎరువుల సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు . ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ దుకాణాధారులు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా అమ్మినా, రసీదులు రాసి ఇవ్వకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు .

హిందూపురం : వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖ సంయుక్తంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ దారులు, టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల దుకాణాల్లో మంగళవారం ఎడిఎ శివకుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివన్న, హిందూపురం ఎడిఎ అల్తాఫ్ ఆలీ ఖాన్ లు బృందంగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాలాజీ ట్రేడర్స్, శ్రీ బందావన ట్రేడర్స్ దుకాణములలో తనిఖీలు నిర్వహించి, బాలాజీ ట్రేడర్స్ లో 16.535 మెట్రిక్ టన్నుల రూ. 4,86,219 విలువ జేసే ఎరువులను సీజ్ చేశారు. డీలర్లు కచ్చితంగా స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేసుకోవాలని, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొన్న ప్రతి రైతుకు తప్పక బిల్లులు ఇవ్వాలని, స్టాక్ బోర్డు పైన స్టాక్ వివరాలు నమోదు చేయాలని హెచ్చరించారు. ఈ తనఖీల్లో మండల వ్యవసాయాధికారి సురేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలి



ఎస్ఇకి వినతిపత్రం అందజేస్తున్న జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా మొదటి ప్రాధాన్యతగా హిందూపురం, మడకశిర ప్రాంతాలకు హంద్రీనీటితో చెరువులు నింపాలని అనంతపురంలో హంద్రీనీవా ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ స్వరూప్ కు జలసాధన సమితి నాయకులు మంగళవారం విన్నవించారు. ఈ మేరకు ఎస్.ఈ.కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నేతలు మాట్లాడుతూ, 2018 నుండి హంద్రీనీవా కాలువ ద్వారా హిందూపురం ప్రాంతానికి, 2019లో మడకశిర ప్రాంతానికి నీరు వచ్చినప్పటికీ ఆయా ప్రాంతాలకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజక వర్గాలలో 265 చెరువులు నింపాల్సి ఉండగా కేవలం 35 నుండి 40 చెరువులు మాత్రమే నింపుతున్నారని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో గొల్లపల్లి రిజర్వాయర్ కు నీరు వచ్చిన నాలుగు నెలల తర్వాత మడకశిర బ్రాంచ్ కెనాల్ కు నీరు వదిలారని పేర్కొన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 19 చెరువులకు, హిందూపురం ప్రాంతంలో నాలుగు చెరువులకు మాత్రమే నీరు ఇచ్చారని, మడకశిర ప్రాంతానికి అసలు నీరు విడుదల చేయలేదని. శ్రీశైలం ప్రాజెక్టు నుండి హంద్రీనీవా ప్రాజెక్టు కాలువకు నీరు వదులుతున్న సందర్భంలో మొదట గొల్లపల్లి రిజర్వాయర్ కు పూర్తి స్థాయిలో నీటిని నింపి వెంటనే మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా హిందూపురం, మడకశిర ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యతగా చెరువులు నింపాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షులు, న్యాయవాది రామ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలి సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఓపిడిఆర్ నాయకులు ప్రకాష్, పిడిఎస్‌యూ నాయకులు వీరేంద్ర, జలసాధన సమితి నాయకులు వీరనారప్ప, తిప్పేస్వామి,కే ఎస్ పి ఎస్ నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని ఓ టీడీపీ నాయకుడిపై మండల జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.13వ తేదీన ఓ పత్రికలో ప్రచురితమైన కథనంపై విలేఖరి శ్రీధర్ రెడ్డిపై దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడిన నాయకుడిపై కేసు నమోదు చేయాలని మండల జర్నలిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమస్యలపై వార్త కథనాలు ప్రచురించే విలేకరుల పట్ల అధికారాన్ని అడ్డం పెట్టుకొని దాడులు చేయడం బెదిరింపులకు పాల్పడడం వంటివి మంచిది కాదని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి హానిచేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఆంజనేయులు, శంకర్, నరసింహా రెడ్డి, విశ్వనాథ్, సురేష్ రెడ్డి, పవన్, వనం శ్రీనివాస రెడ్డి, నారాయణ స్వామి, నాగార్జున, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

పారిశుధ్యంపై కేంద్రబృందం పరిశీలన

ప్రజాశక్తి - గుడిబండ

పారిశుధ్య చర్యలపై మండలంలోని రాళ్లపల్లిలో కేంద్రబృందం మంగళవారం పరిశీలించింది. సెంట్రల్ టీం మేనేజర్ రామాంజనేయులు, జిల్లా ఎస్ బి ఎం.కోఆర్డినేటర్ శ్రీనివాసులు మంగళవారం గ్రామంలో పర్యటించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు,గ్రామాల్లోని వ్యక్తిగత మరుగుదొడ్లు రాళ్లపల్లి సమీపంలోని అక్కమ్మ దేవాలయం కొండపై ఉన్న కళ్యాణమండపానికి సంబంధించిన మరుగుదొడ్లు,ఎస్ డబ్ల్యూ పిసి సెంటర్ లో పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన చెత్త సేకరణ కేంద్రాన్ని వర్మి కంపోస్ట్ సెంటర్లను వారు పరిశీలించారు.అనంతరం అంగన్వాడి సెంటర్లోని మరుగుదొడ్లు,రికార్డులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగరాజు నాయక్, ఎంపీడీవో కార్యాలయం ఏవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు పరిపూర్ణాచారి,చక్రవర్తి,హరీష్ వెన్నెల, ఎస్ బి ఎం మండల కోఆర్డినేటర్ చంద్రప్ప, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో రాజీమార్గం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కోర్టులో కేసుల పరిష్కారం కోసం దీర్ఘకాలంగా ఎదురు చూడకుండా సత్వర పరిష్కారమందించే ప్రత్యామ్నాయ పరిష్కార మార్గం మధ్యవర్తిత్వమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ,న్యాయాధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. మధ్యవర్తిత్వ చట్టం ద్వారా పరిష్కారమైతే కోర్టుకు ప్రజలకు కూడా భారం తగ్గుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన ఇద్దరు న్యాయవాదులు కే నరసింహులు, ఎం ప్రభాకర్ రెడ్డి, ఏజీపీ శివప్రసాద్ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్ర, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్న సమీక్షలో ఆమె మాట్లాడారు. మధ్యవర్తి చట్టం దేశవ్యాప్తంగా అమలు జరుగుతోందని 90 రోజులపాటు ఇందుకోసం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇరువర్గాల ఆమోదంతో వ్యయ ప్రయాసలు ఏమీ లేకుండా ఆర్థిక ఇబ్బందులు కలగకుండా కేసులు పరిష్కరించబడతాయని చెప్పారు. వీటి ద్వారా పరిష్కరించిన కేసులకు తదుపరి అప్పీలు కూడా ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

హిందూపురం :కేసులు పరిష్కరించడంలో మధ్యవర్తిత్వం ఎంతో మేలు చేకూర్చుతుందని ఇన్‌ఛార్జి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అశోక్ కుమార్, ప్రత్యేక న్యాయమూర్తి రమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. కేసుల సత్వర పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం, రాజీ పథక సంఘంను సుప్రీంకోర్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా సమయం వృథా కాకుండా ఉండటమే కాకుండా ఆర్థికంగా కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండమన్నారు. వాణిజ్య, వ్యక్తిగత సంబంధాలు ఏమాత్రం చెడిపోకుండా ఉంటాయన్నారు. మధ్యవర్తిత్వం కక్షిదారుల సమస్య పరిష్కారంలో ఎంతో దోహదపడుతుందని తెలిపారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకొని కక్ష దారులకు సమస్యను పరిష్కరించడంలో సహకరించాలని న్యాయమూర్తులు సూచించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు రామచంద్ర, నరసింహమూర్తి, భాగ్య, నౌరిన్ తాజ్, అభిలాష్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, ఆయా న్యాయస్థానాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - మడకశిర

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మండలంలోని కోనప్ప పాళ్యం ,కోడిపల్లిలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడాది కాలంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం అందించిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్లు నాగరాజు, పట్టణ కన్వీనర్ నాగరాజు, మండల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్చార్జులు, మాజీ జెడ్పిటిసిమాజీ ఎంపీపీ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని 1వ వార్డులోని గూడ్స్ షెడ్డు కొట్టాలలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఈ ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఐసిడిఎస్ మడకశిర ప్రాజెక్టు అంగన్వాడీ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మడకశిర రూరల్

ఐసిడిఎస్ మడకశిర ప్రాజెక్టు అంగన్వాడి యూనియన్ కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా ఉషారాణి, కార్యదర్శిగా శ్రీదేవి, కోశాధికారిగా పద్మావతిని ఎన్నుకున్నారు. అలాగే మడకశిర మండల నాయకురాలిగా ఆరిఫా, రొళ్ల మండల నాయకురాలిగా ఇందిరమ్మ, అగళి మండల నాయకురాలిగా గీతాబాయ్, అలాగే మినీ అంగన్వాడి నాయకురాలిగా మంజులను ఎన్నుకున్నారు.

సింగిల్ విండో కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు సింగిల్ విండో అధ్యక్షురాలిగా ఆర్. చెన్నమ్మ, ముద్దిరెడ్డిపల్లికి చెందిన బయపరెడ్డి సోమగట్ట ఎస్‌ఏపీఎస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. పార్టీ సేవలకు ప్రతిఫలంగా ఈ బాధ్యతలు లభించాయని చెన్నమ్మ పేర్కొన్నారు. పార్టీకి మరింత గౌరవం తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. గతంలో 15 ఏళ్ల పాటు డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవంతో రైతుల సంక్షేమం కోసం పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని బయపరెడ్డి హామీ ఇచ్చారు.

బంగారు కుటుంబాల ఎంపికకు గ్రామసభలు నిర్వహించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అర్హులైన వారిని బంగారు కుటుంబాలకు ఎంపిక చేయడానికి గ్రామసభలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పి 4 కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పి 4 సర్వేలో ఎంపికైన గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 15 నుంచి 25 వరకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ సభలలో ఇప్పటికే ఎంపికైన జాబితాలు పరిశీలించి బంగారు కుటుంబాలకు అర్హులను గుర్తించి గ్రామపంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నుంచి వచ్చిన తమ్మిశెట్టి సాయి సాత్విక్, సిపిఒ విజయ్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పిఎం ఆదర్శ గ్రామ యోజన క్రింద హల్కూరు గ్రామం ఎంపిక : ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జిల్లాలోని అమరాపురం మండలంలోని హల్కూరు గ్రామం రెండవ పేస్ లో ఎంపికైనట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఆ గ్రామ అభివృద్ధి కొరకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ పథకం కింద ఆ గ్రామ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. దీనికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు ఆ నిధులకు ఐదు రెట్లు గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా అంగనవాడి భవన నిర్మాణం, శుద్ధి జల రక్షిత ప్లాంట్, ఎస్సీ కాలనీకి విద్యుత్ స్తంభాలు, ఎస్ హెచ్ జి రిసోర్స్ సెంట్రల్ తదితర పనులు చేపట్టడానికి సంబంధిత అధికారులు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, డి ఆర్ డి ఏ పీడి నరసయ్య, ఎల్ డి ఎం రమణ కుమార్, డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి, డ్వామా పిడి విజయేంద్ర ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లికార్జునప్ప, డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 92 కోట్లతో 'పురం' సమగ్రాభివృద్ధి

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం రూ. 92 కోట్ల నిధులను మంజూరు చేయించారని, ఆ నిధులు వచ్చిన వెంటనే పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లోనూ రోడ్లు మురుగు కాలువల నిర్మాణాలను చేపడతామని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. వార్డు పర్యటనలో భాగంగా మంగళవారం మోతుకపల్లి ప్రాంతంలో అధికారులతో కలిసి చైర్మన్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలసమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించారు.

మడకశిర సింగిల్ విండో ఛైర్మన్‌గా నరేష్

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర ప్రాథమిక వ్యవసాయ సింగిల్ విండో ఛైర్మన్‌గా నరేష్ (కన్నా)ను నియమించారు. మడకశిర సింగల్ విండో సొసైటీ పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. శాసనసభ్యులు ఎం. ఎస్ .రాజుకి, మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామికి , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తికి, కూటమి నాయకులకు ఈ నియామకానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి నరేష్ (కన్నా) కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీలోని గుట్ట కింద పల్లి కి చెందిన రంగారెడ్డి హత్య కేసులో నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ నాగేంద్ర తెలిపారు. ఏడో తేదీన జరిగిన హత్య కేసులో నిందితులు మనోహర్, దాదప్పను స్థానిక రెక్కమాను వద్ద అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు సిఐ తెలిపారు

ధర్మవరంలో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని పోతుకుంట బ్రిడ్జ్ కింద గల రైల్వే పట్టాలపై పట్టణంలో సాయి నగర్ కి చెందిన పర్వతయ్య కుమారుడు నున్న మల్లప్ప (53) అనే వ్యక్తి మంగళవారం రైలు కిందపడి మృతిచెందాడు. హిందూపురం జీఆర్పి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి మాట్లాడుతూ రైల్వే కీ మెన్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని సందర్శించామన్నారు. రైల్వే పట్టాల వద్ద పడిన మతదేహం సాయి నగర్‌కు చెందిన మల్లప్పగా స్థానికులు గుర్తించారు. మృతుడు చేనేత కార్మికుడిగా ఉంటూ కుటుంబాన్ని పోషించేవాడు,మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం మండలాలలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న పలు వాహనాలకు ఆర్డీవో మహేష్ జరిమానా విధించారు. ధర్మవరం నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న ఫిర్యాదులు అధికంగా రావడంతో దాడులు నిర్వహించినట్లు ఆర్డీవో తెలిపారు. మూడు ట్రాక్టర్లు, రెండు ట్రిప్పర్లు ,ఒక జెసిబిని సీజ్ చేసి జరిమానా విధించినట్లు వివరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పురాతమైతే మైండ్స్ అండ్ మినరల్స్ చట్టం కింద నేరంగా భావించి కేసులను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఆవు దాడిలో పాడిరైతు మృతి

ప్రజాశక్తి - రొద్దం

ఆవు దాడి చేయడంతో మండలంలోని డి రంగాపురం గ్రామానికి చెందిన బండి వెంకటప్ప (65) మృతి చెందారు. బండి వెంకటప్ప తన ఆవును మేపడానికి గ్రామ సమీపంలోని పొలాల్లోకి తీసుకువెళ్లారు. అయితే మధ్యాహ్నం ఉన్నఫలంగా ఆవు వెంకటప్పపై దాడి చేసింది. ఈ దాడిలో వెంకటప్ప పెద్దబండపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నరహరి, వీరాంజనేయులు, రామకష్ణ, దొడగట్ట రామచంద్ర, శ్రీనివాసులు, దొడగడ్డ పంచాయతీ కన్వీనర్ వెంకటేశులు, దుర్గప్ప తదితరులు అక్కడికి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

బలవంతపు భూసేకరణను వ్యతిరేకిద్దాం

ప్రజాశక్తి - మడకశిర

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు పూసేకరణను వ్యతిరేకిద్దామని రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనెల 20 న నంద్యాలలో జరుగు భూసదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు సోంకుమార్, వీరేష్, తదితరులు కోరారు. ఈ సదస్సుకు సంబందించిన కరపత్రాలను వారు విడుదల చేశారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ పరిధిలో ప్రతి గ్రామాన్ని సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేద్దామనిఅనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ధర్మవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్లో పలు రికార్డులను పరిశీలించారు. నిరంతరం నాటు సారా పై దాడులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం సిఐ చంద్రమణి, ఎస్ఐ చాంద్‌బాషా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని భక్తరహళ్లి , జిల్లెలగుంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి పంట సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సృజన్, ప్రకతి సేద్య విభాగ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండల పరిధిలోని పెద్దకోట్ల రెవెన్యూ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎడిఎ లక్ష్మినాయక్ పంటసాగుపై రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమలో మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒల నూతన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్య సాయి జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల నూతన సంఘాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా జిల్లా పరిషత్ కార్యాలయంలో సత్యసాయి జిల్లా ఎంపీడీవోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల నూతన సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోరంట్ల ఎంపీడీవో నరేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెనుకొండ ఎంపీడీవో నరేష్‌కృష్ణ, కోశాధికారిగా నల్లచెరువు ఎంపీడీవో రఘునాథ్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ధర్మవరం ఎంపీడీవో సాయి మనోహర్, సహాయ కార్యదర్శిగా తలుపుల ఎంపీడీవో నసీమా, కార్యవర్గ సభ్యులుగా అమరాపురం బుక్కపట్నం సికేపల్లి ఎంపీడీవోలు రామారావు శ్రీనివాసులు బాలకృష్ణుడు ఎన్నికయ్యారు. నూతన సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవోలు ఎదుర్కొంటున్న సమస్యలపై జడ్పీ సీఈఓకు ఈసందర్భంగా వినతి పత్రం అందించారు.

కెజిబివి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రొద్దం

ప్రపంచ స్కిల్స్ డే సందర్భంగా మంగళవారం కస్తూరిబా గురుకుల పాఠశాలలో నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనపర్చారు. బ్యూటీ అండ్ విల్లెన్స్ అనే ఒకేషనల్ ట్రేడ్ కార్యక్రమంలో 9, 10, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో క్విజ్, డ్రాయింగ్, ట్రేడింగ్, మీ హ్యాండ్ స్కిల్స్‌లో పాల్గొన్నట్లు కేజీబీవీ ప్రిన్సిపల్ నాగరత్న తెలిపారు. మండల కేంద్రంలో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న వాణి ఈ స్కిల్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు పోటీల్లో ప్రతిభ కనపర్చిన వారికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఛలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. మంగళవారం స్థానిక డీఈ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల శ్రమను గుర్తించి, వారి జీవితాల్లో వెలుగులు నింపే విధంగా నూతన ఆర్డినెన్స్ విధానాన్ని అమలు పరిచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన విజయవాడలో సిఎంబి కార్యాలయం గేటు నుంచి చాంబర్ వరకు మోకాళ్ళ మీద నడుచుకుంటూ వెళ్లి వినతిని అందించే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యుత్, కార్మికులు పాల్గొన్నారు.